సాక్షి వైఎస్సార్ జిల్లా

గురువారం । 18 । జనవరి । 2024



గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

జిల్లాలో 75వ గణతంత్ర వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. -10లో



భారీగా బంగారు, నగదు సీజ్

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేని డబ్బు, బంగారు ఆభరణాలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. -10లో

గరిష్టం/కనిష్టం
31.8/18.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 18.2 – 31.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

పులివెందులలోని రాణితోపు



కొప్పర్తిలోని డిక్సన్ పరిశ్రమ



కడపలోని మహావీర్ సర్కిల్



నలుదిశలా ప్రగతి పరుగులు

- జిల్లాలో విశేషాభివృద్ధి
- రిమ్స్‌లో రూ.322.8 కోట్లతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు
- పులివెందులలో రూ.500 కోట్లతో నూతన మెడికల్ కళాశాల
- బద్వేలు వద్ద రూ.1000 కోట్లతో సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమ
- జమ్మలమడుగు నియోజకవర్గంలో రూ.8,800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ
- రూ.220 కోట్లతో కడప నగర సుందరీకరణ, నూతన రోడ్లు ఏర్పాటు
- కొప్పర్తిలో రూ.127 కోట్లతో ఆల్ డిక్సన్ కంపెనీ నిర్మాణం



కడప రిమ్స్‌లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్

సాక్షి ప్రతినిధి, కడప: కడప గడపలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక వసతులతో పాటు పారిశ్రామిక ప్రగతి వేగంగా రూపుదిద్దుకుంది. ఆల్ డిక్సన్, సెంచరీ ప్లైబోర్డ్స్, ఆదిత్యా బిర్లా గార్మెంట్స్ లాంటి సంస్థలు వచ్చి చేరాయి. రాయలసీమ నిరుద్యోగ సమస్యకు ఫుల్‌స్టాప్ పడేలా జేఎస్‌డబ్ల్యూ నేతృత్వంలో స్టీల్ ప్లాంట్ పురుడు పోసుకుంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వచ్చింది. నూతనంగా మరో ప్రభుత్వ మెడికల్ కళాశాల సిద్ధమైంది. పదేళ్ల నిరాదరణకు గురైన వైఎస్సార్ జిల్లా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో నలుదిశలా వృద్ధి చెందుతోంది.

కొప్పర్తి పారిశ్రామికవాడ 2014–19 టీడీపీ సర్కార్‌లో నిరాదరణకు గురైంది. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనాపగ్గాలు చేపట్టాక ఈ సెజ్‌పై ప్రత్యేక చొరవ పెట్టారు. 801 ఎకరాల్లో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేశారు. రూ.10వేల కోట్ల పెట్టుబడులు సమీకరించి లక్ష ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే రూ.80 కోట్లతో ఏర్పాటు చేసిన ఆల్ డిక్సన్ కంపెనీ (ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ) ప్రారంభమైంది. ఈ సంస్థలో 1100 మంది యువతకు ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. మరో రూ.127 కోట్లతో 1800 మందికి ఉపాధి లభించేలా విస్తరణ చేపట్టారు. రూ.50 కోట్లతో నిర్మించిన డీజీజీ ఎక్స్‌పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా మరో 2100 మందికి ఉద్యోగాలు లభించాయి. పారిశ్రామికవృద్ధి సాధిస్తేనే యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయనే దృక్పథంతో కొప్పర్తి పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతున్నారు. ఇంకోవైపు విద్యా సంస్థల రూపురేఖలు మార్చారు. నాడు–నేడు పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 718 ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులతో సరికొత్త భవనాలతో కొత్తరూపు సంతరించుకున్నాయి.

నియోజకవర్గం	డీబీటీ (రూ.కోట్లలో)	నాన్ డీబీటీ (రూ.కోట్లలో)	మొత్తం (రూ.కోట్లలో)
బద్వేలు	1268.73	378.12	1646.85
ప్రొద్దుటూరు	1135.46	680.99	1816.45
కమలాపురం	1115.20	261.64	1376.84
మైదుకూరు	1285.28	334.10	1619.38
కడప	1063.37	753.70	1817.07
జమ్మలమడుగు	1492.78	388.86	1881.64
పులివెందుల	1496.59	481.69	1978.28

రూ.120.34 కోట్లతో తొలి విడత పనులు పూర్తి అయ్యాయి. రెండోవిడతలో మరో 1005 విద్యా సంస్థలు రూ.289.56 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు.



ప్రొద్దుటూరు అభివృద్ధికి రూ.515 కోట్లు మంజూరు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019 డిసెంబర్, 23న రూ.515 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాయలసీమలో అతి పెద్ద కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు రూ.50.5 కోట్లతో శ్రీకారం చుట్టారు. రామేశ్వరం వద్ద ఆర్టీపీపీకి వెళ్లే దారిలో పెన్నానదిపై హైలెవెల్ బ్రిడ్జిని మరో రూ.53 కోట్లతో నిర్మిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రొద్దుటూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.150 కోట్లతో నిర్మించిన అమృత్ నీటి పథకాన్ని ప్రారంభించారు. పట్టణంలోని రహదారులు, పార్కుల నిర్మాణాలు కొనసాగించారు.

కనులవిందుగా సుందరీకరణ



కడపలోని కోటిరెడ్డిసర్కిల్

కడప నగరం కనులవిందుగా రూపుదిద్దుకుంది. దశాబ్దాలు తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారుల విస్తరణ వేగంగా చేపట్టారు. మరో రూ.120 కోట్లతో నగరంలోని 12 జంక్షన్లను వృద్ధి చేశారు. రూ.6.85 కోట్లతో రాజీవ్‌మార్గ్ రోడ్డు, రాజీవ్ పార్క్ ఆధునికీకరించారు. రూ.69.2 కోట్లతో పాత బళ్లారి రోడ్డు, రూ.100 కోట్లతో దేవుని కడప రోడ్డు విస్తరణ చేపట్టారు. రూ.10 కోట్లతో ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు నిర్మించారు. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానాన్ని రంజీ, దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లకు వేదికగా తీర్చిదిద్దారు. రూ.8.27 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. వీటితో డే అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు, లైవ్ ఇచ్చేందుకు కూడా వీలవుతుంది.

కడప శిగలో మణిహారం

జమ్మలమడుగు సమీపంలో జేఎస్‌డబ్ల్యూ సంస్థచే నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్ కడప శిగలో మణిహారంగా నిలవనుంది. తొలివిడతగా రూ.3,300 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 2023 ఫిబ్రవరి, 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.720 కోట్లు వెచ్చించి మౌలిక వసతులను సమకూర్చింది. నాలుగులైన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, భవన సముదాయం అందుబాటులోకి తెచ్చారు. విస్తరణ అనంతరం రూ.8800 కోట్లు పెట్టుబడి, 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో 25వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించేలా రూపకల్పన చేశారు.

రెండేళ్లలోనే సెంచరీ ప్లైబోర్డ్స్ సంస్థ



గోపవరం వద్దగల సెంచరీ ప్యానల్స్ లిమిటెడ్ పరిశ్రమ

బద్వేల్ నియోజకవర్గం గోపవరం సమీపంలో ఏర్పాటు చేసిన సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన తర్వాత రెండేళ్లలోనే ప్రారంభించారు. 589.23 ఎకరాల్లో రూ.956 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టిన ఆ సంస్థ పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటి రెండు దశల పనులు కూడా పూర్తి చేశారు. 2021 డిసెంబర్, 23న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయగా, 2023 డిసెంబర్ 23న ఆయన చేతుల మీదుగానే ప్రారంభించారు. ఈ పరిశ్రమ ద్వారా ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.. 2076 మంది స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించాయి. 2662 ఉద్యోగాలు అవసరమైతే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటికి 78శాతం ఉద్యోగాలు స్థానికులకు లభించడం విశేషం.

మెడికల్ హబ్‌గా రిమ్స్



రిమ్స్‌లోని క్యాన్సర్ కేర్ సెంటర్

కడప రిమ్స్ వైద్యశాల ప్రాంగణాన్ని ప్రభుత్వం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దింది. రూ.322.82 కోట్లతో మూడు ఆధునాతన వైద్యశాలలను నిర్మించింది. 452 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, 100 పడకల మానసిక వైద్యశాల, 100 పడకల కేన్సర్ హాస్పిటల్‌ను నెలకొల్పింది. గతంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 180ఎకరాల విస్తీర్ణంలో 'రిమ్స్' వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రూ.322.82 కోట్లు వెచ్చించి, సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై మన కడప రిమ్స్‌లో లభించనున్నాయి. మరోవైపు పుష్పగిరి కంటి ఆస్పత్రి, ఇంకోవైపు డాక్టర్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిని సైతం అందుబాటులోకి వచ్చాయి.

పులివెందులలో వైద్యకళాశాల



పులివెందులలోని మెడికల్ కళాశాల

పులివెందుల కేంద్రంగా రూ.500 కోట్లతో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలను నెలకొల్పారు. ప్రారంభోత్సవానికి సన్నాహాలు కొనసాగుతున్నాయి. వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు ఇప్పటికే ప్రారంభించారు. రూ.32.82 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ అకాడమీ ఏర్పాటు చేశారు. రూ.39 కోట్లతో డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ గార్డన్, రూ.69 కోట్లతో ఉలిమెల్ల చెరువు సుందరీకరణ పూర్తి కానున్నాయి. రూ.24కోట్లతో ఆర్టీసీ బస్టాండ్, డిపో ఏర్పాటు చేశారు. భూగర్భ డ్రైనేజీ, రహదారుల విస్తరణ, నూతన రోడ్లు ఏర్పాటు చేపట్టారు. రూ.5.60 కోట్లతో పార్నపల్లె వద్ద చిత్రావతి జలాశయంలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. ఆధునాతన పార్కులు, సుందరంగా రహదారులు, రింగ్‌రోడ్ల సర్కిళ్లు తీర్చిదిద్దారు. ఒక్కమాటలో చెప్పాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో జిల్లాలో ప్రగతి నలుచెరుగులా విస్తరించిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

23న పెయింటింగ్ పోటీలు

కడప ఎడ్యుకేషన్: 'పరీక్షా పే చర్చా'కు సంబంధించి ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు కడపలోని కేంద్రీయ విద్యాలయంలో పెయింటింగ్ పోటీలుంటాయని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. పరీక్షల ఒత్తిడిని తట్టుకునేందుకు విద్యార్థుల కోసం రూపొందించిన ఒక ప్రత్యేక కార్యక్రమన్నారు. ఈ పెయింటింగ్ పోటీలకు 9 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. చంద్రయాన్, స్పోర్టింగ్ సక్సెస్ ఆఫ్ ఇండియా, వికసిత్ భారత్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆదిత్య ఎల్–1లు ఈవెంట్ థీమ్స్‌గా ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు 23వ తేదీ ఉదయం 9 గంటలకు కడపలోని కేంద్రీయ విద్యాలయ సంస్థకు రావాలన్నారు.

21న బ్యాడ్మింటన్ టోర్నీ

కడప స్పోర్ట్స్: కడప పక్కీరుపల్లెలోని పీవీఆర్ స్పోర్ట్స్ ఎరీనాలో ఈనెల 21వ తేదీ న్యాయశాఖ ఉద్యోగులకు డబుల్స్ విభాగంలో బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.నాగరాజు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, గుమాస్తాలు.. న్యాయశాఖ ఉద్యోగులందరూ ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 19 లోగా తమ ఎంట్రీలను అందజేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9440223908, 9440990589 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరిపాలనాదక్షుడు శ్రీకృష్ణదేవరాయలు

కడప కార్పొరేషన్: శ్రీకృష్ణ దేవరాయలు తెలుగువారికి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మాత్యులు అంజద్‌బాషా పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయల జయంతి సందర్భంగా బుధవారం కడపలోని కృష్ణా సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ రాయలు తన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ గొప్ప పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి,కడప మేయర్ సురేష్ బాబు, కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, గిడ్డంగుల చైర్మన్ కరిముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు దుర్గాప్రసాద్, అమరప్ప, పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, శివప్రసాద్,తోట క్రిష్ణ, బండి బాబు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల/టౌన్: విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అయిన శ్రీకృష్ణదేవరాయలు అందరికీ ఆదర్శప్రాయుడని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బలిజ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న రాయల విగ్రహం వద్ద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలిజ కళాకారులు, క్రీడాకారుల చరిత్ర పుస్తకాన్ని ఎంపీ చేతులమీదుగా ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, రాయల కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, బలిజ సంఘ నాయకులు కడియాల లక్ష్మినారాయణ, ఆంజనేయులు, జయప్రకాష్, జగన్నాథ్, శ్రీరాములు, బాబు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఖాళీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీ దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడపలో 12, పులివెందులలో 13, బద్వేలులో 17, పోరుమామిళ్లలో 6, జమ్మలమడుగులో 10, మైలవరంలో 9, మైదుకూరులో 12, ప్రొద్దుటూరులో 2, రాజుపాలెంలో ఒక దుకాణానికి టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు టెండరు ఫారాలు తీసుకుని 23వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కడపలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో గల టెండరు బాక్సులో దరఖాస్తులను వేయాలన్నారు. మధ్యాహ్నం 3.00 గంటలకు టెండర్లను తెరిచి అర్హులకు దుకాణాలను కేటాయిస్తామన్నారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: రానున్న పార్లమెంటు, అసెంబ్లీ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జోన్–4కు సంబంధించిన ఉమ్మడి కడపజిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ సీసీఎల్‌ఏ ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పద్మావతమ్మను ఉరవకొండ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కడప కలెక్టరేట్ ల్యాండ్–1 సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇ.ప్రతాప్ రెడ్డిని గుడిబండకు బదిలీ చేశారు. అలాగే కలెక్టరేట్ భూ విభాగం–2 సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.భారతిని పుట్టపర్తికి బదిలీ చేశారు. అన్నమయ్య కలెక్టరేట్‌లో పనిచేస్తున్న జి.నాగభూషణాన్ని నల్లమాడకు, డి.శ్రావణిని ధర్మవరానికి బదిలీ చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.భూషణంను చాపాడు మండలానికి బదిలీ చేశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని జి.పుణ్యవతిని సుండుపల్లె తహసీల్దార్‌గా నియమించారు. సత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేసే ఎ.శ్రీనివాసులును పుల్లంపేటకు బదిలీ చేశారు. అదేవిధంగా ఆ జిల్లా కలెక్టరేట్ భూ విభాగంలో పనిచేసే టి.ఆనంద్‌కుమార్‌ను రామాపురం తహసీల్దార్‌గా నియమించారు.

క్లుప్తంగా

గోడ కూలిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి

చెన్నూరు : గోడ కూలిన ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా..ఈనెల 6వ తేదీన చెన్నూరు మండలం నజీర్‌బేగ్‌పల్లెలో నివాసం ఉంటున్న పెనుబాల సుబ్బారాయుడు తోపాటు మరో ఇద్దరు వ్యక్తులు కలసి బాత్రూం గోడ వద్ద గుంత తీస్తుండగా అకస్మాత్తుగా గోడ మీద పడటంతో సుబ్బారాయుడుకి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. కాగా గాయపడిన వారిని కడప రిమ్స్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సుబ్బరాయుడు మృతి చెందాడన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితులతో పోలీసులు

సింహాద్రిపురం : ద్విచక్రవాహనాల చోరీ కేసులో సింహాద్రిపురం మండలం హిమకుంట్ల క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రోషన్ తెలిపారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కడప నాగయ్యపల్లెకు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, అలాగే అగ్రహారానికి చెందిన రామకృష్ణారెడ్డిలు తమ ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బుధవారం సింహాద్రిపురానికి చెందిన రామాంజినేయులు, రాము అనే ఇద్దరిని హిమకుంట్ల క్రాస్ వద్ద అరెస్టు చేసి వారు దొంగిలించిన వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

మట్కా ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చాంద్‌బాషా

వేంపల్లి : స్థానిక వేంపల్లి పట్టణ పరిధిలో ఉన్న చింతలమడుగుపల్లి క్రాస్ వద్ద మట్కా ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాషా విలేకరులకు తెలిపారు. బుధవారం తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఐదుగురు మట్కా ఆడుతుండగా పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి మట్కాకు సంబంధించిన స్లిప్పులు, రూ.44,150 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి చట్టపైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే స్థానిక రాజీవ్ కాలనీ వద్ద జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.5500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాల్ నాయక్, సిబ్బంది కిరణ్, వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో 75వ గణతంత్ర వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 75వ గణతంత్ర వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డీఎఫ్‌ఓ సందీప్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సంమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను, వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు, అభివద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ, డ్వామా, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖ, వ్యవసాయం, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, డీఎంహెచ్‌ఓ, ఆప్కో, చేనేత, తదితర శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కోవిడ్-19 ప్రభావం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సామాజిక, భౌతిక దూరం పాటించేలా సీట్ల ఏర్పాటు చేయాలన్నారు.

పరిశ్రమల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలి

పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల లోపలే కాకుండా పరిశ్రమల చుట్టుపక్కల ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్ సైట్ కాకుండా ఆఫ్‌సైట్‌లో అలారం సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ తుషార్ డూడి, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఫాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఏపీఎస్‌పీడీసీఎల్, ఐటీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఆర్టీపీపీ, ఫైర్ శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పనిసరి

సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులను కల్పించాలని కలెక్టర్ విజయ రామరాజు ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ గణేష్ కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి ఎలక్షన్ రిటర్నింగ్ అధికారులు (ఈఆర్వోలు), సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (ఏఈఆర్వోల)తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అదేవిధంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఇంటర్నెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందుకు సంబంధించి ముందస్తు భద్రతను ఏర్పాటు చేసే దిశగా ఆదేశాలిచ్చారు. అదేవిధంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ పరిధిలోని 80 సంవత్సరాలు వయసు పైబడిన ఓటర్లు, దివ్యాంగులను గుర్తించి వారికి సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు మధుసూదన్, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఓఎస్డీ రఘునాథ్, ఎస్డీసీలు చంద్రమౌళి, కౌసర్ బాను, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

బ్రహ్మంగారిమఠం : సహకార పరపతి సంఘాలు బలోపేతం కావాలంటే రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో నూతనంగా రూ.24లక్షలతో నిర్మించిన సహకారపరపతి సంఘం కార్యాలయం ప్రారంభానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, చైర్‌పర్సన్ ఝాన్సీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరొక రైతుకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీల కోరిక మేరకు త్వరలో సహకార బ్యాంక్, రైతు గోడౌన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ సహకార పరపతి సంఘంలో ప్రతి రైతుకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తారన్నారు. అలాంటి పరపతి సంఘాన్ని రైతులు కాపాడుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు సహకార పరపతి సంఘాలను నిర్వీర్యం చేశాయన్నారు. బి.మఠంలో రైతుల కోసం గౌడన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు సూచిస్తానన్నారు. మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, కడప డీసీసీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ ఎంఈ సుబ్బారెడ్డి, బి.కోడూరు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, బి.మఠం సింగిల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బిరెడ్డి. డీసీసీ బ్యాంక్ సిబ్బంది, సహకార పరపతి సంఘం సిబ్బది, రైతులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' అడ్డుకున్న వారిపై కేసు నమోదు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నాలుగో వార్డులో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డిలు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం చేస్తుండగా దాసరి రాజశేఖర్‌రెడ్డి, దాసరి రంగారెడ్డి , దాసరి లోకేశ్వరరెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులు రావద్దుంటూ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ చోటు చేసుకుంది. వెంటనే అక్కడే ఉన్న పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సద్దుమణిగింది. ఈ సంఘటనకు కారకులైన దాసరి రాజశేఖర్‌రెడ్డి, దాసరి రంగారెడ్డి , దాసరి లోకేశ్వరరెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

పార్వతీదేవికి వెండి కవచం బహూకరణ

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న పార్వతీ దేవికి వెండి కవచాన్ని భక్తులు బహూకరించారు. ప్రొద్దుటూరుకు చెందిన బాలాజీ, శిరీష మకర సంక్రాంతిని పురస్కరించుకుని 1250 గ్రాముల వెండితో అమ్మవారికి కవచం చేయించి ఇచ్చినట్లు ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. వాటి విలువ రూ.లక్షా 30 వేలు అని చెప్పారు. దాతలకు చైర్మన్, అర్చకులు ధన్యావాదాలు తెలిపారు.

రూ. 2 లక్షల వితరణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని బయనపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి తుమ్మల పరమేశ్వర్ రెడ్డి 2 లక్షల రూపాయలు వితరణగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే బైనపల్లి గ్రామానికి చెందిన ప్రజలే కాకుండా వివిధ గ్రామాల ప్రజలు ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేయడం చాలా సంతోషకరమని అన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

వల్లూరు : కుటుంబ సమస్యల నేపథ్యంలో ఆత్మహత్యా యత్నం చేసిన ఒక వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడిన సంఘటన వల్లూరు మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కుమారునిపల్లెకు చెందిన బండారు రవి అనే వ్యక్తి కుటుంబ సమస్యల కారణంగా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మంగళవారం రాత్రి గంగాయపల్లె రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే వల్లూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ హృషీకేశవ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన హెడ్ కానిస్టేబుల్ ఓబుల్ రెడ్డి, కానిస్టేబుల్ ప్రసాద్ రాజులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్య చేసుకోబోతున్న రవిని కాపాడారు. అనంతరం అతనిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.



ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తితో వల్లూరు పోలీసులు

కారు ఢీకొని వ్యక్తి మృతి

మైదుకూరు : మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లె సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సానం కొండారెడ్డి (50) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లెక్కలవారిపల్లెకు చెందిన కొండారెడ్డి కొన్నేళ్లుగా బ్రహ్మంగారిమఠం మండలం లింగందిన్నెపల్లెలో నివాసం ఉంటున్నాడు. ప్రతి రోజు లెక్కలవారిపల్లెకు వచ్చి పొలం పనులు చూసుకుని తిరిగి లింగందిన్నెపల్లెకు వెళుతుంటాడు. బుధవారం రాత్రి లెక్కలవారిపల్లె నుంచి బైక్‌పై బయల్దేరిన కొండారెడ్డిని పోరుమామిళ్ల వైపు నుంచి వస్తున్న కారు ముదిరెడ్డిపల్లె సమీపంలో ఢీ కొంది. ఈ సంఘటనలో తీవ్ర రక్తగాయాలైన కొండారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

చింతకొమ్మదిన్నె : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుం బాషా ఆదేశాల మేరకు బుధవారం విజిలెన్స్ అధికారులు సీకే దిన్నె మండలం కృష్ణాపురం గ్రామంలో దాడులు నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఓ హోటల్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఐదు గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాల నిమిత్తం వాడుతున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని పెండ్లిమర్రి గంగ ఇండేన్ ఏజెన్సీ వారికి అప్పగించారు. హోటల్ యజమాని నరసింహారెడ్డిపై నిత్యావసర సరుకుల చట్టం–1955 మేరకు 6–ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారి రెడ్డెప్ప, సీఐ బాలగంగాధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి సౌజన్య, కడప సీఎస్‌డీటీ, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్‌రావు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవశకం

అమ్మ ఒడితో బిడ్డను చదివించుకుంటున్నా



నిరుపేదలమైన మేము గతంలో బిడ్డను చదివించుకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అమ్మ ఒడి పథకంతో మూడేళ్లుగా డబ్బులు మా ఖాతాకు జమ అవుతున్నాయి. మూడో తరగతి చదువుతున్న నా కుమార్తె గీతశ్రీని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నా. పుస్తకాలు, యూనిఫాం దుస్తులు ఉచితంగా అందజేశారు. అమ్మ ఒడి పథకంతో మమ్మల్ని ఆదుకున్న సీఎంకు రుణపడి ఉంటాం.

– ఎం. కుసుమ, ఇందిరమ్మ కాలనీ, పీలేరు.

జగనన్న సురక్ష ద్వారా కుల ధ్రువీకరణ పత్రం



నాలుగు నెలల క్రితం మా ఊర్లోని గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మీటింగ్ పెట్టారు. ఈ మీటింగ్‌లో క్యాస్ట్ సర్టిఫికెట్ ఇచ్చారు. మా ఇంటికి వలంటీరు వచ్చి నా ఆధార్ కార్డు చూసి వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలని చెప్పారు. ఎలాంటి డబ్బులు తీసుకోకుండా సచివాలయం వద్ద ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకున్నాను.

– శ్రీపతి వరకుమారి, అన్నవరం, చాపాడు మండలం

సొంతింటి కల సాకారమైంది



పన్నెండు ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. కూలి పని జీవనాధారం. సొంతిల్లు కట్టుకునే స్తోమత లేదు. కూలి చేస్తే వచ్చే డబ్బులతో పొట్ట నింపుకోవడంతో పాటు ఒక్కగానొక్క కూతురి వివాహం జరిపించాను. దీంతో సొంతింటికల కలగానే మిగిలిపోయింది. మా గ్రామం యర్రగుంట్లపల్లె కురవపల్లెలో మాకున్న పాత ఇల్లు వర్షం వస్తే పూర్తిగా తడిసిపోయేది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం అర్జీ పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదలందరికీ ఇళ్లు ఇస్తున్నారని తెలిసింది. గ్రామ వలంటీరు మా ఇంటికి వచ్చి ఆధార్ కార్డు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించారు. అనుకున్నట్లే ఇల్లు మంజూరైంది. ఎట్టకేలకు జగనన్న పుణ్యమా అని సొంతింటి కల సాకారమైంది. జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఆనందమ్మ, కురవపల్లె, యర్రగుంట్లపల్లె, పీలేరు, అన్నమయ్య జిల్లా

కడపలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు సీజ్





బంగారు ఆభరణాలు, నగదును పరిశీలిస్తున్న కడప ఒన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి, కడప టూటౌన్ పరిధిలో పట్టుకున్న నగదు వివరాలను తెలియజేస్తున్న ఎస్‌ఐ సంజీవరాయుడు

- ఒన్‌టౌన్ పరిధిలో రెండు సంఘటనల్లో రూ. 57,93,782 నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- టూటౌన్ పరిధిలో రూ. 8 లక్షలు నగదు సీజ్

కడప అర్బన్ : రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల సమయంలో ఎలాంటి పత్రాలు లేని అధిక డబ్బు, బంగారు ఆభరణాలను బుధవారం పోలీసులు సీజ్ చేశారు.

- కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు బుధవారం గాంధీసర్కిల్ వద్ద సీఐ సి. భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. విజయదుర్గాకాలనీకి చెందిన పల్లా వెంకట సురేష్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకెళుతున్న రూ. 2,83,500 నగదును, 796.700 గ్రాముల బంగారు ఆభరణాలను సీజ్ చేశారు. బంగారు ఆభరణాలు, నగదు విలువ సుమారు రూ. 50,43,782 ఉంటుంది.
- మరోవైపు కడప నగరంలోని మునిరావు వీధి వద్ద వల్లూరు మండలం నత్తి షారుక్‌ఖాన్ నుంచి రూ. 5 లక్షలు, నత్తి మాబు షరీఫ్ నుంచి రూ. 2.50 లక్షలు మొత్తం రూ. 7.50 లక్షలు నగదును పట్టుకున్నారు. వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో తదుపరి చర్యల కోసం తిరుపతి ఇన్‌కం టాక్స్ శాఖ వారికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.
- ఈ సంఘటనల్లో సీఐతో పాటు ఎస్‌ఐలు జి. మధుసూదన్‌రెడ్డి, వి. రంగస్వామి, ఎం. సిద్దయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు పి. సుబ్బరాయుడు, పి. వరప్రసాద్, కానిస్టేబుళ్లు వై. సుబ్బరాయుడు, టి. కిరణ్‌కుమార్, ఏ. సామయిగోపినాథ్‌లను కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ అభినందించారు.
- కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఎస్‌ఐ సంజీవరాయుడు బుధవారం తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపపట్టారు. కడప సాయిపేటకు చెందిన బొలిచెర్ల సుబ్బరాయుడు తన స్కూటీలో రూ. 8లక్షల నగదును తరలిస్తూ ఉండగా ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేక పోవడంతో డబ్బును సీజ్ చేసి తదుపరి చర్యల కోసం తిరుపతి ఐటీశాఖ వారికి అప్పగించనున్నారు.

ఎర్రగుంట్లలో బంగారు అభరణాలు..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా సుమారు రెండు కిలోల బంగారు ఆభరణాలను పోలీసు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రొద్దుటూరు నుంచి ముగ్గురు వ్యక్తులు తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుత్తణిలకు బంగారు ఆభరణాలు తీసుకుని బయలుదేరారు. అయితే రైల్వే క్రాస్ రోడ్డు వద్ద ఎర్రగుంట్ల పోలీసులు తనిఖీ చేపట్టారు. బస్సు దిగి రైల్వే స్టేషన్‌కు వెళుతున్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా బ్యాగులలో సుమారు రెండు కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కొండాపురంలో రూ.2 లక్షలు

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కడప–తాడిపత్రి జాతీయ రహదారి కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద బుధవారం ఓ కారులో రూ. 2 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా ముద్దనూరు నుంచి తాడిపత్రి వైపు ఓ కారులో వస్తున్న దుస్తుల వ్యాపారి నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నగదుకు సంబంధించి అతని వద్ద ఎలాంటి పత్రాలు లేవని తెలిపారు.

బద్వేలులో రూ. 7.50 లక్షలు

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో అర్బన్ పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఇరువురు వ్యక్తుల నుండి రూ.7.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ పి.యుగంధర్ తెలిపారు. ఆశ్రమం వీధికి చెందిన పోకల తిరుపాల్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్న రూ.2.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వల్లెరవారిపల్లె గ్రామానికి చెందిన బెల్లం రామసుబ్బారెడ్డి తన ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్న రూ.5 లక్షలు నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పై రెండు ఘటనల్లో స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని నగదును ఐటీ అధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో రూ. 22 లక్షలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆకస్మికంగా జరిపిన ఈ తనిఖీల్లో ఎలాంటి పత్రాలు చూపని రూ. 22 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు టూ టౌన్ పరిధిలోని బంగారు అంగళ్ల వీధిలో బుధవారం టూ టౌన్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నెల్లూరు జిల్లాలోని దుత్తలూరుకు చెందిన జయరామిరెడ్డి అనే వ్యక్తి తన కుమార్తె వివాహం సందర్భంగా బంగారు నగలు చేయించేందుకు బుధవారం ప్రొద్దుటూరుకు వచ్చారు. అతను డబ్బు సంచి పట్టుకొని నిల్చొని ఉండగా పోలీసులు అక్కడికి వచ్చి తనిఖీ చేశారు. అందులో రూ. 14.50 లక్షలు నగదు ఉండటంతో ఇంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. బంగారు నగలు చేయించుకోవడానికి వచ్చానని చెప్పినా పోలీసులు వినిపించుకోలేదు. డబ్బుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించలేదనే కారణంతో నగదును స్టేషన్‌కు తీసుకెళ్లారు. నగదును సీజ్ చేసి తిరుపతిలోని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించనున్నట్లు టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.

త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

త్రీ టౌన్ పరిధిలో సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బైక్‌లో వెళ్తున్న ఒక వ్యక్తిని ఆపి సోదాలు చేయగా అతని వద్ద రూ. 7.50 లక్షలు ఉన్నాయి. అయితే ఈ డబ్బుకు సంబంధించి తగు పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ ఇబ్రహీం